# ప్రైవేటు మాష్టారు

బండీ ఆగింది. ఆగిన వెంటనే సామాను - ఒక ట్రంకుపెట్టి - ఒక బెడ్డింగు తానే దింపుకొని దిగాడు హరిహరరావు. మరో రెండు నిముషాల్లో కూతవేస్తూ రైలు స్టేషనుదాటి వెళ్ళిపోయింది. అతను నాలుగైదు గజాల దూరంలో ఉన్న దీపపు స్తంభం వద్దకువెళ్ళి టికెట్టు తీసి చూచుకొని దీపం గ్లాసుపై వ్రాసివున్న ఊరిపేరు చదువుకొని మరేం పొరపాటు పడలేదులే అనుకున్నాడు.

సందడే లేదు. ఆ స్టేషనులో. అతనొక్కడేదిగ దేమోననిపించింది. హరిహరరావు మెల్లగావెళ్ళి టికెట్టు స్టేషన్‌మాస్టరు కిచ్చేస్తూ "ఏమండీ ఊళ్ళోకి వెళ్లేందుకు బళ్ళేమైనా వస్తాయండీ" అని అడిగాడు.

"తెల్లవారితేనే గాని రావు" అని ఆయన తనపని ముగించుకొని వెళ్ళిపోయాడు. అతను మళ్ళావచ్చి పెట్టెమీద బెడ్డింగుపెట్టి దానిపై కూర్చుని దిక్కులు చూడటం మొదలుపెట్టాడు. ఇంకా చాలా చీకటి ఉంది. ఆకాశంలో మినుకు మినుకుమంటూ అక్కడొకటీ అక్కడొకటీ నక్షత్రాలు మెరుస్తున్నాయి. మబ్బులు మెల్లగా పాకుతున్నాయి. చాలా దూరంలో ఊరిదీపాలుకన్పిస్తున్నాయి. చాలా సేపుఅతనక్కడే ఒంటరిగా కాలంగడిపాడు. కాసేపు చీకట్లో మెరుస్తున్న నక్షత్రాలవంకా మరికొంత సేపు స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్న ఊళ్ళోకివెళ్ళే బాటవంకాచూస్తూ కాసేపు అటూ ఇటూ పచార్లుచేశాడు. తూర్పు తెలతెల వారుతుండగా దూరంలో

ఒక బండీ - దీపం కన్పించింది. బాగా దగ్గరకు వచ్చిన తర్వాతగాని అది జట్కాబండి అని అతను తెలుసుకోలేక పోయ్యాడు.

బండివాడు సరాసరి అతని దగ్గరకే వచ్చి 'మీరేగదండీ కట్టయ్యగారింటికి వచ్చేదీ ?' అని అడిగాడు.

"ఆ. ఆ. అవునయ్యా - బండీ వారే పంపారా" అని ఆత్రంగా అడిగాడు హరిహరరావు. దారిలో రావు బండివాడితో మాటాడుతూ ఆ ఊరి విషయమూ కట్టయ్యగారి సంగతీ అడిగి తెలుసుకొన్నాడు.

డొంక తిరిగి తీరా ఊళ్ళోకి వచ్చాక విద్యుద్దీపాలు కన్పించాయి. చెరువు ప్రక్కగా కంకరరోడ్డు మీదుగా చాలా దూరం వెళ్ళి పార్కు దాటాక ఒక పెద్ద స్థలంలో వరిహరీగోడల మధ్య ఉన్న మేడముందు బండీ ఆగింది.

సామాను చేతపట్టుకొని బండీవాడే అతన్ని లోపలకు తీసుకొని వెళ్ళి ఆ యింటి జీతగాణ్ణి పిలిచి అతని రాకను తెలియ పరిచాడు. ఆ జీతగాడు హరిహరరావును చాలా గౌరవించి మేడమీద గదిలోకి తీసికొనివెళ్ళి "ఈగది మీకిమ్మన్నారండీ - అయ్యగారు మరోగంటకల్లా వస్తారండి" అని చెప్పి "మీరు స్నానం చేద్దురుగానిరండి" అని క్రిందకు వెళ్ళి పోయాడు. అతను సామాను తీసి సద్దుకొన్నాడు. పుస్తకాలన్నీ అలమారలో పెట్టుకొన్నాడు. ఆ పుస్తకాలన్నీ తీసివేసే సరికి బెడ్డింగూ పెట్టే రెండు మూడు వంతులు ఖాళీ అయినాయి. ఉన్ననాల్గు జతల బట్టలూ పెట్టెలో సద్దుకొని లుంగీ ఒకటి కట్టుకొని అతడా గదిలోనే కాసేపు అటూ ఇటూ తిరిగాడు. అక్కడ ఒక అందమైన మేజాబల్ల - ఒక కుర్చీ ఉన్నాయి. వాటిని అలమారకూ కిటికీకి మధ్యగా జరిపి తనకు వీలైన తీరున అమర్చుకొన్నాడు.

అంతలో "రండి నీళ్ళు తోడాను" అని జీతగాడు వచ్చి పిలిచి స్నానాల గదికి తీసికొని పొయ్యాడు.

అక్కడే పళ్ళపొడి - పేస్టూ - తాటాకులూ సబ్బుబిళ్ళా - అన్నీ ఉన్నాయి. గదినేలపై పాలరాళ్ళు పరచి ఉన్నాయి. ఒక ప్రక్క పెద్ద గంగాళం నిండా పొళ్ళుచేసిన వేడినీళ్ళు ఉన్నాయి. చిన్న ఇనుప కడ్డీ - దండేంలాగా వ్రేలాడవేసి ఉన్నదానిపై రెండు ఇస్త్రీ తువ్వాళ్ళు సిద్ధపరచి ఉన్నాయి. అవన్నీచూచి రావు వారి హోదానూ వారి గౌరవాదరణలనూ తలచుకొంటూ సుఖంగా నెమ్మదిగా కాలకృత్యాలను తీర్చుకొని ఇంటి వాళ్ళెవరూ కన్పించరేమా అనుకొంటూ తన గది చేరుకొన్నాడు.

అతను చొక్కా వేసుకొని తలదువ్వుకొనే లోపలనే వంటమనిషి ఒక పెద్ద వెండి కంచంలో రెండు ఇడ్లెన్లూ ఒక చిన్న కప్పుతో నెయ్యి కారప్పొడీ పెట్టుకొని మరో చేత్తో మరచెంబుతో నీళ్ళుతీసికొని వచ్చాడు. సరే ఈపూటకు ఊళ్ళోకి వెళ్ళి హోటలు వెతుక్కునే అవసరం తప్పిందికదా అనుకొంటూ ఆతను వాటిపని చూశాడు. దువ్వెన అవతల పెట్టివేస్తూ. తర్వాత వేడి కాఫీ కాస్తకాస్త త్రాగుతూ కిటికీలోంచి ఎదురుగా క్రిందుగా ఉన్నవారి తోటవంక చూస్తూ నిలబడ్డాడు హరిహరరావు.

"ఆ-మరేమైనా కావాలా అండీ" అని అడిగి అక్కర్లేదంటే వంటవాడు క్రిందకు వెళ్ళిపోయాడు తలుపు దగ్గరకు వేస్తూ. రాత్రంతా ప్రయాణంలో నిద్ర లేకపోవడంచేత చాలా బడలిక అనిపించింది రావుకు. అందులో పొట్ట కాస్త బరువుఅనిపించిందేమో కాస్త ఓ కునుకు తీద్దామని బుద్ధిపుట్టింది. తలుపు గడియ వేసుకొనివచ్చి అక్కడే పరచిఉన్న తివాచీమీద బెడ్డింగు తలక్రింద పెట్టుకొని పడుకొన్నాడు.

అతనికి - కునుకేగాదు మంచి నిద్రేపట్టింది. ఎంతసేపు నిద్ర పోయాడో అతనికే తెలియదు.

బారెడు ప్రొద్దెక్కిన తర్వాత తలుపు చప్పుడై తేలేచి వెళ్ళి గడియ తీశాడు - భుజంపైనున్న తువ్వాలతో కళ్ళు తుడుచుకొంటూ. తలుపు తెరవగానే వారే కన్పించారు. వారే - అతనికి కాబోయ్యే యజమాని కట్టయ్యగారు. సన్నని గ్లాస్కోపంచ కట్టారు సిల్కులాల్చీ వేసుకొన్నారు. పెద్ద టర్కీతువ్వాల ఒకటి భుజంమీద వేసుకొన్నారు. చిరునవ్వుతో పల్కరించాడాయన "ఏమయ్యా పంతులూ నిద్ర పట్టిందత్లేవుంది. అవున్లే రాత్రంతా జాగారంచేసి ఉంటావ్ - సరెసరె - భోజనాలు చేద్దాం మరి బయలుదేరు'' అన్నారు. ఆయన పల్కరించిన తీరూ-తీసికొన్న చనువూ - చూపుతున్న ఆదరణా చూచి హరిహరరావు ఆశ్చర్యపోయాడు. నమస్కారంచేసి "అవునండీ" అంటూ సమాధానం చెప్పి అతను వారివెంట నడిచాడు.

పెద్ద పీట - పీట ముందు అరటి ఆకులూ వేసి ఉన్నాయి. ప్రక్కనే ఒక క్యారేజీ ఉంది హోటలు కుఱ్ఱవాడు 'వడ్డించ మంటారండీ' అని అడిగాడు.

''ఈ పూటకు హోటలు భోజనం కానివ్వండి మావటినుండి మన లింగయ్యగారింటినుండి వచ్చే ఏర్పాటు చేస్తాను" అన్నాడు కట్టయ్య గారు గుమ్మంలో నిలబడి.

"ఎవరండీ వారు"అని ఆగి చిరునవ్వు నవ్వుతూ ''మా శాఖీయులేనా'' అన్నాడు రావు.

"ఏం, అయితేగాని పనికిరాదా ఏమిటి." "అబ్బే ఊరికేనే అన్నానండీ-అయినా మాకానలనాటి వారేమోనని అడిగాను" "అవునులే అదే అనుకొన్నా - అయినా మా చలపతి చెప్పాడు గానీ, నీకా పట్టింపు

లేవీ లేవని - అసలా ఇబ్బందేమీ లేదులే - మంచి బ్రాహ్మణకుటుంబం. లింగధారులు వాళ్ళు, చాలాయోగ్యుడయ్యా ఆయన" అన్నారు కట్టయ్యగారు.

"ఎల్లాగా అండీ - మొత్తంమీద మీరు చాలా శ్రమపడుతున్నారు. పోనీ నన్ను వెళ్ళి హోటల్లో భోజనంచేసి రానివ్వకూడదా అండీ..." అని అడిగాడురావు.

"అబ్బే - ఇదెల్లా - మా యింట్లో ఉంటూ హోటలు భోజనమా- వీల్లేదు." అది వారి హోదాకు తగని పని అని అర్థంచేసుకొని రావు మాటాడక అంగీకారాన్ని తెలియ వరచి భోజనం ముగించాడు. భోజనానంతరం రావును తన గదిలోకి తీసికొని వెళ్ళారు కట్టయ్యగారు.

ఆ గది విశాలంగా అందంగా ఉంది. రెండు సోఫాలు - నాలుగు కుర్చీలూ ఉన్నాయి. తానొక సోఫాలో కూర్చుని చుట్టకాలుస్తూ అతన్ని మరో కుర్చీలో కూర్చొమని సంజ్ఞ చేశారు.

"ఆ అయితే అబ్బాయ్ - గది సౌఖ్యంగా ఉందా? మరేం కావాలన్నా మొహమాటం పడక అడుగుతూ ఉండు. ఊళ్ళోంచి ఏమైనా కావాలన్నా నౌకర్లు ఉన్నారు - వాళ్ళను పిలిచి చెపుతూ ఉండు"

"అట్లాగేనండీ" అన్నాడు రావు.

ఆయన ఏదో లోకాభిరామాయణం మొదలు పెట్టారు. ప్రతివాడికీ రాజకీయాలు వంటపట్టినంతగా మరేదీ పట్టడంలేదయ్యా అంటూ తమ పిల్లలు వెళ్ళే బడి సంగతీ - ఊరి వ్యవహారాలు చెప్పడం మొదలు పెట్టారు.

రావు మరికొంతసేపు ఓపికపట్టి తన జీతం విషయం ప్రస్తావన వస్తుందేమోనని వేచి ఊరుకున్నాడు.

అసలు అతని కీదారి చూపింది - చలపతిరావుగారే. ఆయన క్రిందటిసారి అతని స్వగ్రామం ఏదో వ్యవహారం మీద వచ్చినప్పుడు తన ఇంటికే వచ్చారు. వారిని తనకో ఉద్యోగ విషయంలో సిఫార్సు చేయమంటూ హరిహరరావు అడిగాడు.

"ఏమండీ - వారు మీకు జైలు మేటటగదండీ. మీరుగనుక సిఫార్సుచేస్తే నాకు పని అయ్యి తీరుతుంది" అని ప్రాధేయబడ్డాడు.

వారు "అబ్బాయి - మీ కుటుంబానికీ నాకూ ఉన్న సంబంధాన్ని పట్టి నీకింతమాత్రపు పని చెయ్యడం ఒక గొప్ప విషయంకాదు. కాని నేనెవ్వరికీ ఎప్పుడూ సిఫార్సులు చెయ్యలేదు. వాళ్ళ దగ్గరకు వెళ్ళలేదు. వాళ్ళ చుట్టూ తిరగలేదు. అందువల్లనే నేను సిఫార్సు చేస్తే బాగుండదు. అదీగాక అలవాటు లేని పనిచెయ్యను. ఆ విషయం వదిలెయ్యి. ఆ తాత్కాలికపు ఉద్యోగానికి ఇంత ప్రయాస పడే బదులు నేనొక పని చెబుతా చెయ్యి.

నా స్నేహితుడు - మంచి స్థితిమంతుడు - మంచి ఆదరణచూపే మనిషి - కట్టయ్యగారని ఒకాయన ఉన్నారు మాచుట్టుపట్ల వారే గొప్ప ఆసామి. జమీందారు హోదాలో ఉంటారు. వారి పిల్లలకు చదువుచెబుతూ ఒక సంవత్సరం వారింట్లోనే ఉండే వ్యక్తి కావాలని అన్నారు. నామాట విని అక్కడికి రా. అన్ని సదుపాయాలూ చూపి నెలకో నలభయ్యో ఏభయ్యో గిట్టే ఏర్పాటు చేస్తారాయన" అన్నారు చలపతిరావుగారు.

ఆయన మాటలు విని రావు మొదట ఇదేదో జీతగాడ్ని మాటాడినట్లుగా ఉందనుకొని ఒక్క చిరునవ్వుతో త్రోసిపారేద్దామనుకొన్నాడు. "అబ్బాయ్ - అసలు నువ్వీ విషయంలో కాదనకు - వారికీ నీయందు మంచి అభిప్రాయమే గనుక కుదిరితే నిన్ను వృద్ధిలోకి తీసుకొనివస్తారు. పై చదువులకు వెళ్ళేందుకు ఏదో ఒక మార్గం

చూపించుతాడు." అని వారు రావుతోనే గాక అతని తండ్రితో కూడా చెప్పి ఒప్పించి వెళ్ళారు.

"ఏమిరా మహా పెద్ద బెట్టుపోతున్నావ్ - ఇక్కడ నువ్వేదో పెద్ద ఉద్యోగమేదో వెలగబెడుతున్నట్లూ. ఆరు నెలలు పనిచేస్తే మళ్ళా ఆరు నెలలూ గోళ్ళు గిల్లుకొంటూ నీలాంటి వాళ్ళతో తిరగడమేనా నువ్వు చేసేది ? పోయిరా చలపతిరావుగారు అంతగా చెబుతూవుంటే - మళ్ళా ఆలోచించడం కూడానా" అన్నారు రావు తండ్రి.

అప్పటికి రావు సమాధానపడి తన హృదయపూర్వక అంగీకారాన్ని తెలియ పరచాడు.

పదిహేను రోజుల తర్వాత కట్టయ్యగారి దగ్గరనుండి జాబు వచ్చింది. వారి ఉత్తరం చూచుకొని సంతోషించి రావు - ఆ ఉత్తరాన్ని చేత పట్టుకొని వారి స్వగ్రామం బయలుదేరి వచ్చాడు. జీతం ఇంత అని తెలుసుకొని సంతోషిద్దామని అనుకొని ఎంత ప్రయత్నం చేసినా ఆ మాట ఎంతకూ బయటకు రాలేదు.

"అయితే ఇంతకూ పిల్లలు కన్పించలేదేమండీ" అని అడిగాడు. ఆ విషయమైన తరువాత జీతం విషయం అడుగుదామని అనుకొంటూ.

"పిల్లలూ ఇంటావిడా మా బావమరిది ఇంట్లో బారసాలకు వెళ్లారు. ఇక్కడే లెండి - దోసపాడు వెళ్లారు. రాత్రికి వచ్చేస్తారు" అని ఆయన పిల్లల అల్లరిని గురించి చెప్పుకుపోయారు. "మరీ గడుగ్గాయిలవుతున్నారయ్యా, మరి నువ్వెల్లా దారికి లాక్కొస్తావో ఏమో" అన్నారాయన.

చివరకు తెగించి వినయంగానే అడిగాడు రావు జీతం విషయం.

''అయితే ఏమండీ నా జీతం విషయం,...''అని ఆగాడు వారివంక చూస్తూ.

ఆయన ఆ మాటవిని అట్టే విననట్టుగానూ అదేమంత ముఖ్య విషయం కాదన్నట్లూచూస్తూ "అవి తర్వాత చూచుకోవచ్చు లెండి ముందు పని కానివ్వండి" అన్నారు.

జీతం విషయం మాట్లాడటం, వారి హోదాకు తక్కువ అయినట్లుగా రావు వెంటనే అర్థం చేసుకొన్నాడు. అందుకు అతనికి ఆశ్చర్యమూ కలిగింది. సంతోషమూ కలిగింది. బేరాలు చేయడం వ్రాయివేటు ఐళ్ళల్లో కొంత అలవాటే అయినా వారిముందు అట్టిప్రస్తావన తెచ్చినందుకే రావు కొంత సిగ్గుపడ్డాడు. " సరేనండి " అన్నాడు. కొంతసేపు తర్వాత ఆయన పెద్దగానవ్వుతూ "ఏం ఫరవాలేదు లేవయ్యా పంతులూ - నువ్వు వాళ్ళను కాస్త ఓదారిలో పెట్టు. మిగతా విషయాలు మా చలపతితో మాట్లాడి ఏదో ఏర్పాటు చేయిస్తాను. ఎప్పుడైనా పదీ అయిదూ కావలసివస్తే పిల్లలచేత కబురు పెట్టు-వాళ్ళ అమ్మే ఇచ్చేస్తుంది. సరేనా" అన్నారు.

"అట్లాగేనండీ - మీరు నాయందు చాలా దయగా ఉన్నారు. మరి నేనువెళ్ళి మరికొంతసేపు విశ్రాంతి తీసుకొంటానండీ" అని చెప్పి రావు మేడపైకి వెళ్లాడు.

నాల్గింటికి కాఫీత్రాగి ఊళ్లోకి బయలు దేరివెళ్లి నాల్గు ప్రక్కలా చూచివచ్చాడు.

రాత్రి భోజనం అయిన తర్వాత "మీరు వెళ్లి పడుకోండి - బళ్లు కట్టుకొని వాళ్లూ వస్తారు. వాళ్లు వచ్చేదాకా ఉండి నేనూ పడుకొంటా" అన్నారు కట్టయ్యగారు.

వెంట తెచ్చుకొన్న ఒక నవల తీసికొని పదిగంటలదాకా చదువుకొంటూ పడుకొన్నాడు రావు.

"పార్కులో హత్య" అన్న ఇంగ్లీషు నవల రెండవ అధ్యాయం పూర్తి కావచ్చింది. అందులో హంతకుడు ప్రేల్చిన పిస్తోలు ఢాం ఢాం అని మ్రోగుతుండగా సరే ఈ అధ్యాయం అయింది కదా తర్వాత వీణ్ణి ఎలా పట్టుకుంటారో చూద్దాంలే అని పుస్తకం మూసేసి నిద్రకు ఉపక్రమించాడు రావు.

కొంతసేపు చదువుతున్న పుస్తకాన్ని గూర్చి మరికొంతసేపు కాబొయ్యే శిష్యులనుగూర్చి ఆలోచిస్తూ నిద్రపోయాడు రావు.

తెల్లవారిన తరువాత తలుపు దగ్గర ఏదో పెద్ద చప్పుడయితే రావు ఉలిక్కి పడిలేచాడు. రాత్రి ఆ పార్కులో హత్య అన్న పుస్తకం చదువుతూ నిద్రపోయ్యాడో ఏమో నిద్రలేస్తూనే ఈ శబ్దం వినేసరికి ఓ క్షణం కొంచెం భయమయింది రావుకు. అంతలో అబ్బేఇదేమిటీ ఇల్లా వులిక్కి పడ్డానను కొంటూ చప్పున వెళ్ళి తలుపుతీశాడు. ఆ ద్వారాని కెదురుగా క్రిందకు వెళ్ళే మెట్లమీద రెండు చిన్న క్రికెట్ బంతులు మూలలు కొట్టుకొంటూ దొర్లిపోతున్నాయి. సరే ఇది శిష్యులు చేసిన పనేలే అనుకొంటూ అతను తువ్వాలు పైన వేసుకొని అనుమానంగా అటూ ఇటూ చూస్తూ స్నానాల గదిలోకి దారి తీశాడు.

ఆ క్రిందటి రాత్రి ప్రొద్దుపోయాక ఆ యింటి యజమానురాలు తన ముగ్గురి పిల్లలనూ వెంట బెట్టుకొని ఇంటికి తిరిగి వచ్చింది. కట్టయ్యగారు ఆవిడతో పిల్లలు వింటుండగా క్రొత్తమాష్టరు వచ్చిన సంగతి అది కొంత వివరంగా చెప్పారు.

"నాన్నగారూ నా కీ మాష్టారు లెక్కలూ సైన్సూ రెండూ చెప్పగలరా" అని అడిగింది వారి పెద్దమ్మాయి శేషు. ఆ అమ్మాయి స్కూలుఫైనలు పరీక్షకు రెండవసారి వెళ్ళబోతోంది " ఆ ఆ " అన్నారాయన సమాధానంగా. "ఈయనకూడా పాత మాష్టారిలా ముసలి

వాడేనా అండీ" అని అడిగాడు - చౌదరిగారి రెండో సంతానం - తల్లి గారాబంతో మంకుతనం నేర్చుకొన్న పన్నెండేళ్ళ కుర్రవాడు గోపాల్. అతను రెండవ ఫారం రెండుసార్లు తప్పి మూడవ ఫారంలోకి వచ్చాడు. అతన్నీ ఏడాది తప్పకుండా గట్టెక్కించాలని కట్టయ్యగారు సంకల్పించు కొన్నారు. "అబ్బే కాదురా" అని వారు ఇంకా ఏమో చెప్పబోతుంటే అతని చెల్లెలు ఎనిమిదేండ్ల పిల్ల "తొడపాశం పెడితే మట్టుకూ నేనసలు ఆయన దగ్గర ఒక్క పాఠం కూడా చదవనే చదవను" అని బుంగమూతి పెట్టింది. ఆ పిల్ల తెల్లని తెలుపు జాతి బొమ్మలా అందంగా ముద్దుగా ఉంటుంది. కట్టయ్యగారికి ఆ పిల్ల అంటే- లక్ష్మి- అంటే తగని గారాబంకావడంచేత ఆ పిల్లకు నాలుగో ఎక్కం కూడా రానంటోంది ఏడాదినుండి. వారా పిల్ల నొకసారి ఎత్తుకొని దింపి "లేదమ్మా, ఈ పంతులుగారు చాలా మంచివారు. బాగా చదువుకొన్న వారు. మీ కందరికీ పాఠాలు బాగా చెబుతూ ఇక్కడే ఉంటారు. మరి మీరు ముగ్గురూ చక్కగా వినయంగా వారిదగ్గర చదువుకోవాలి, ఏం సరేనా! అయితే ఇంక వెళ్ళి పడుకోండి, ఆయనా మీ ప్రక్కగదిలోనే నిద్రపోతున్నారు. రేపు ప్రొద్దుట మీ అందరికీ వారిని చూపుతాను" అని చెప్పారు.

పిల్లలూ మేడమీదే పడుకొన్నారు. ఆయన నిద్ర లేవకముందే నిద్రలేచారు. పెద్దపిల్ల క్రిందకు వెళ్ళిపోయింది. చిన్నవాళ్ళిద్దరూ ఒక చిన్నప్లాను వేశారు. పూర్వం ఉండి వెళ్ళిన ముసలి మాష్టరుగారి విషయంలో ఆ ప్లాను బాగా పని చేసింది. ఆ బంతులు విసిరి తలుపుకు కొడితే పెద్ద చప్పుడు అవుతుంది దాంతో లోపల ఉన్న పంతులు భయపడి పోవాల్సిందే! ముసలి పంతులు దొంగలు దొంగలు అని పెద్దగా అరిచాడు, వచ్చిన రోజున ఆ చప్పుడు విని. కనుక ఆయన

భయస్తుడని తేల్చేసుకొన్నారా చిన్నవాళ్లు. సరే, ఈయన సంగతేమిటో ఈపూటే తేల్చేసుకొందామని ఆ పనే చేశారు.

రావు తన గదిలో కాఫీ త్రాగుతుండగా, కట్టయ్యగారు ముస్తాబై వచ్చిన ముగ్గురి పిల్లలనూ వెంటపెట్టుకొని అక్కడికి వచ్చారు. రావు వారికి అభివందనం చేసి కుర్చీలో వారిని కూర్చోమని తాను కిటికీ దగ్గరగా నిల్చున్నాడు.

సంజ్ఞచేస్తే వారు– ఆ ముగ్గురూ ముక్తకంఠంతో "నమస్కారమండీ" అన్నారు. రావు చిరునవ్వు నవ్వుకొన్నాడు. వారు ముగ్గురూ తివాచీమీద కూర్చున్నాక వారిని కట్టయ్యగారు రావుకు పేర్లూ చదువు వివరాలు చెప్పి "ఇక మీదే భారం. వాళ్లు ఏదైనా మాట వినని పక్షంలో నాకు చెప్పండి. ఇంతవరకు వాళ్ల ఆగడమే సాగింది. ఇంక సాగనివ్వను. ఆ మాట వాళ్ళ తల్లికి ఈపూటే చెప్పేస్తాను. ఎప్పుడో ఏమిటి– ఇదుగో ఇప్పుడే వెళ్లి నిస్సంకోచంగా చెప్పివేస్తాను– సరే మీరు పాఠాలు మొదలుపెట్టండి – ఒరేయ్ మీరు మీ పుస్తకాలవీ వారికి చూపండర్రా" అని ఆయన క్రిందకు చాలా దర్జాగా దిగి వెళ్ళారు. రావు ఆయన చివరిమెట్టు దిగేదాకా గుమ్మంలోనే ఉండి తర్వాత పిల్లల వంక చూచాడు. వాళ్ళు పుస్తకాలు తెచ్చుకొంటామండీ అని చాలా బుద్ధిమంతులకుమల్లే గడప దాటారు. గడప అవతల కొంచెం ప్రక్కగా నిలబడి "తొందరగా రండి" అన్నాడు రావు. వాళ్ళు గడప దాటారో లేదో– పెద్దమ్మాయి పదునాల్గేళ్ళేమో ఉంటాయి, బక్కపల్చగా పొట్టిగా ఉంటుంది. ఆ పిల్ల ఒక్కసారి గిరుక్కున తిరిగి రావును చూచి ఓ కొంటెనవ్వు ఒకటి విసిరి– "చూద్దాం మీ చదువేమిటో!" అన్నట్లు చూచి చరచరా వెళ్ళిపోయింది. మిగిలిన చిన్నవాళ్ళిద్దరూ ఆ వరండాలో కొంతదూరం వెళ్లారో లేదో కిలకిలమని నవ్వారు వెనక్కు

తిరక్కుండానే. వాళ్ల వ్యవహారం చూచి, చూడనట్లే మరోవైపు చూస్తూ మొత్తంమీద గడుగ్గాయిలే అనుకొన్నాడు రావు ప్రొద్దుట దొర్లిపోతున్న బంతులు జ్ఞాపకం వచ్చి ఇంకేం వీళ్ళు చేసిన పనే అది అని అనుకున్నాడు.

ఆపూటనుండే వాళ్ళకు పాఠాలు మొదలుపెట్టాడు కొత్తపంతులు హరిహరరావు. 'అన్నంఅంతా పట్టిచూడాలా' అన్నమాట రావుకు జ్ఞాపకం వచ్చి బాగా అర్థమయ్యింది ఆ పిల్లలకు పాఠం చెప్పడం మొదలుపెట్టిన మొదటి పావుగంటలోనే.

'పెద్దమ్మాయి దస్తూరి బొత్తిగా బాగుండలేదు. ఈ అమ్మాయిచేత తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ కాపీలు వ్రాయించాల్సిందే' అనుకొన్నాడు.

ఆ కుర్రవానికి రెండవ ఫారం రీడరు చదవడమే రాదు. తొందర తొందరగా తప్పులుగా చదివేస్తాడు. "అల్లా కాదోయ్ మెల్లగా-తప్పులు లేకుండా చదవాలి" అంటే "మా మాస్టారు అల్లాగే చెప్పారు" అన్నాడు. లక్ష్మి - ఆ చిన్నపిల్లను నాలుగో ఎక్కం వప్పజెప్పమ్మా అంటే - 'రేపు చెబుతానండీ' అన్నది. పాఠం తీసి చదవమంటే- "పుస్తకం చూశండి, చినిగిపోయింది. మరి చివరి పాఠాలు చెప్పందే ఎల్లా చదవనండీ?" అని క్లిష్టప్రశ్న వేసింది

మొదటి పాఠాలు కాగితాలేమో చింపివేసింది. చివర మిగిలి ఉన్నవి చదవడం చేతకాదు. పైగా ఎదురు ప్రశ్న: 'బాగుందిరా భాయీ నీ ఉద్యోగం' అనుకొన్నాడు రావు లోలోన నవ్వుకుంటూ-ఒక దీర్ఘనిశ్వాసం విడుస్తూ.

చిన్నపిల్ల దేముందిలే అనుకొని పెద్దపిల్లలిద్దరకూ ఆ పూట పాఠాలు చెప్పాడు రావు. ఆ అమ్మాయి చెబితే వినదు. ఆ అబ్బాయికి పదిసార్లు చెప్పినా అర్థంకాదు. ఆ అమ్మాయికి ఒకసారి చెప్పినప్పుడే

వింటే ఇట్టే అర్థమవుతుంది. కాని ఇంతలో నాల్గు చిలిపి ప్రశ్నలు వేస్తుంది. ఆ అబ్బాయి పదిసార్లూ చెప్పించుకొని 'అబ్బే ఎందుకండీ మీరిన్నిసార్లు చెబుతారూ నాకు మొదటే అర్థమయిందండీ' అని అంటాడు కాని చెప్పిన విషయాన్ని గురించి ఎన్నిసార్లు ఎన్ని రకాలుగా ప్రశ్నలు వేసినా ఒకదానికీ సరియైన సమాధానం రాసీయడు. సరే వీరి స్థితి ఇట్లా ఉన్నది. ఎల్లాగయినా సరే వీళ్లకు పాఠాలు కాస్త కట్టుదిట్టంగానే చెప్పాలి అనుకొని రావు ఒక దృఢనిశ్చయానికి వచ్చాడు.

మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత కట్టయ్యగారితో మాటాడుతూ తాను తెలుసుకొన్న విషయంలో కొంత వారికి చెప్పి వారిచేత కాపీ పుస్తకాలూ - పెన్సిళ్లూ లక్ష్మికి కావలసిన వాచకాలూ అవీ తెప్పించి తన నిశ్చయాన్ని తెలియచేశాడు. చౌదరిగారు సంతోషించారు.

మధ్యాహ్నం రెండింటికి మళ్ళా పాఠం అరంభించాడు రావు.

'నేను - నేను కాపీలు వ్రాయడ మేమిటండీ మాస్టారూ' అన్నది శేషు, వ్రాయనంటే వ్రాయను అన్నట్లు పెన్సిలు క్రింద పెట్టేస్తూ. దస్తూరీ బాగుసరచుకోవడం ఎంత ముఖ్యమో దానివల్ల కలిగే లాభం ఏమిటో వివరించి చెప్పి- నచ్చచెప్పి ఒప్పించి ఆ అమ్మాయిచేత ఆ పూటకో పేజీ కాపీ వ్రాయించేసరికి రావుకు చాలా శ్రమ అనిపించింది. రేపటికి మరో రెండు కాపీలు వ్రాసి చూపాల్సిందేనని చివరకు నిక్కచ్చిగా చెప్పాడు. ఆ అబ్బాయికి ఇంగ్లీషులో ఒక చిన్నకథ ఒక్కొక్క మాటే మెల్లగా చదివి అర్థం చెబుతూ చదివి వినిపించి అందులో మొదటి రెండు పేరాలు మరునాటికి వప్పజెప్పాలని పురమాయించాడు

లక్ష్మికి పది పంక్తులు గల ఒక పాఠం చెప్పి రెండో ఎక్కం చదివిస్తుండగా పైకి కాఫీ వచ్చింది. కాఫీగ్లాసు పట్టుకొని తెచ్చిన మనిషి

అక్కడే నిల్చుని ఉండటం చూచి "పాఠం చెబుతున్నప్పుడు ఇవేమీ తీసికొని మీరెవరూ ఇక్కడకు రాకండి'' అని చెప్పాడు రావు పిల్లలను కాఫీలకు రమ్మని కబురు వచ్చింది. "పాఠం అయ్యాక వస్తారు" అని కబురు తెచ్చిన మనిషిని తిరిగి పంపాడు రావు. వాడొక రకంగా చూస్తూ క్రిందకు వెళ్ళాడు.

ఆ అమ్మాయి "ఆజ్ఞాపించే ధైర్యమా!'' అన్నట్లు రావు వంక చూచింది.

నే నివన్నీ లెక్కచేసేవాణ్ణి కాదన్నట్లు కొంచెం కోపంగా చూచాడు రావు.

వారు ముగ్గురూ తమ పనులలో నిమగ్నులైనట్టుగా నటించారు.

తర్వాత అరగంటకు వాళ్ళతోపాటే తానూ బయలుదేరి కాఫీకి క్రిందకు వెళ్ళాడు రావు- తన విధిని సరిగా నిర్వహించ గలిగినందులకు కొంత గర్వపడుతూ. పైగా లక్ష్మిని దగ్గరకు తీసుకొని క్రిందకు ఎత్తుకొని వెళ్ళాడు

ఆ రావడం చూచి కట్టయ్యగారు సంతోషిస్తూ "అయితే అందరికంటే ఈ చిట్టితల్లిమీదే మీకు మంచి అపేక్ష కుదిరిందన్నమాట" అన్నారు.

ఆ రాత్రి అతని గదిలోకి గాలి సరిగా రాకపోవడం వల్లనేమీ - ప్రొద్దు పోయేదాకా చదువుకోవడం వల్లనేమీ ఆ మరునాడు పెందరాళే లేవలేక పొయ్యాడు రావు. పిల్లలు నిద్రలేచి పాఠాలకు తయారయ్యేసరికి అతని తలుపు ఇంకా వేసే ఉంది. ఆ కాసేపట్లానే పిల్లలు ఆ అలస్యాన్ని గమనించి అందుకు కారణాలు వెతుక్కున్నారు.

"ఇవ్వాళ మాస్టారికేమో తల నొప్పి వచ్చి ఉంటుంది - అందుకే ఇంకా మనల్ని పాఠాలకు పిలవలేదు" అన్నది శేష "అవునే అక్కా, మన పాతమాస్టారికీ అల్లాగే అయిందే ఒకసారి" - అని చెల్లెలువంక తిరిగి "లక్ష్మి మాస్టారికి తలనొప్పి నిజంగా వచ్చేవుంటుందే- మనం పోయి ఆడుకొందాందా" అన్నాడు గోపాల్. అని ఓ క్షణమాగి "ఒసేయ్ - మాస్టారికీ రోజూ తలనొప్పి వచ్చేస్తుంటే ఎంత బాగుంటుందే-" అన్నాడు.

"కానీ- రోజూ ఎందుకొస్తుం దన్నయ్యా" అని అమాయకంగానే అడిగింది లక్ష్మి.

"ఎందుకు రాకూడదే- రావచ్చు- కొందరికీ అల్లా వస్తుందట కూడా" అని మహ తెలిసినవాడల్లే మొహంపెట్టి అంతటి మహత్తర విజ్ఞానాన్ని చెల్లిముందు ప్రదర్శించినందుకు గర్వపడి ఇంకా ఇల్లా అన్నాడు- "ఆ మందులవాళ్ళు తలనొప్పి పోగొట్టే మందు కనిపెడు తున్నారు గానీ మాస్టారికి తేలిగ్గా తలనొప్పి వచ్చేమందు కనిపెడితే బాగుండు- కదూ" అన్నాడు చెల్లెలివంక చూస్తూ.

అంతలో "ఇష్-ఇష్ వారు వస్తున్నట్లున్నారు" అని శేష హెచ్చరిక చేసేసరికి ఆ చిన్నవాళ్ళు ఆ ప్రసంగాన్ని కాసేపు ఆపారు.

రావు వారి మాటలన్నీ విని కూడా విననట్లు నటిస్తూ పాఠాలకు రండని పిలవడానికి వెళ్ళాడు.

అతన్ని చూడగానే లక్ష్మి "మాస్టారూ పాఠాలు చెబుతారా అండీ ఇవ్వాళ కూడా" అని అడిగింది.

"ఎందుకు చెప్పనమ్మా- రండి మరి" అన్నాడు రావు.

"మీకు తలనొప్పి వచ్చిందేమో అనుకొన్నామండీ" అన్నది శేష.

"అబ్బే అదేమిటి"- అన్నాడు రావు.

"లేదా అండీ- రానేలేదండీ" అని అడిగాడు గోపాల్.

"అయితే మేం తప్పుగా ఊహించామండీ" అని ఆగింది శేషు.

"వచ్చిందేమో అనుకొన్నామండీ" అన్నాడు గోపాల్.

"పూర్వం పాతమాష్టారుగారికోసారి వచ్చిందండీ"

"అప్పు డప్పుడు వస్తుండే దండీ"

"మీకు అలాగే..."

పెద్దపిల్ల లిద్దరూ వరుసగా ఒకరి తర్వాత ఒకరు మాటాడారు.

"ఆఁ నిజంగా - మీరిల్లా మరో పది నిమిషాలు మాట్లాడితే తలనెప్పి వస్తుంది కూడా" అన్నాడు రావు.

"అహ అల్లాగా అండీ" అన్నాడు గోపాల్. ఇక లాభం లేదని రావు కొంచెం కోపం తెచ్చుకొని "ఇక కట్టిపెట్టి చదువుకోడానికి రండి వెంటనే" అని ఆజ్ఞాపించి తన గదిలోకి వెళ్ళాడు. పెద్దమ్మాయికి ఇంగ్లీషు - తెలుగు రెంటిలోనూ వ్యాకరణము బొత్తిగా రాకపోవడం గమనించి నెస్ఫీల్డు గ్రామరు - చిన్నయసూరి బాల వ్యాకరణమూ తెప్పించి క్షుణ్ణంగా చెప్పి చదివించాడు. మొదట్లో "ఇప్పుడు నాకీ వ్యాకరణాలు మొదటినుంచీ చెబుతూ కూర్చుంటే మనకు కావలసిన పోర్షన్సు ఎప్పుడవుతాయండీ" అని ఎదురు ప్రశ్న వేసింది శేషు. "అదంతా నీ కెందుకమ్మా మార్చి పరీక్షకు నిన్ను తయారుచేసి పరీక్ష ప్యాసయ్యేటట్లు చేసే బాధ్యత నాదీ- నువ్వల్లా చెప్పినట్లు చెయ్యి. హిష్టరీ, జాగ్రఫీ అట్లాంటివి నువ్వు చదువుకో. మిగతావన్నీ నేను చెబుతాను సరేనా?" అన్నాడు రావు

రావు వేసిన పథకాలు చూచి ఆ అమ్మాయి మొదట్లో ఈయనేదో కాలక్షేపం చేయడానికి కీ ఎత్తు వేశాడని అనుకొన్నా, తర్వాత తర్వాత తెలిసివచ్చింది.

*　　　*　　　*

మొత్తంమీద అతనే మళ్లా పరీక్షకు- అయిదేండ్ల క్రిందట వెళ్లిన పరీక్షకు- వెళ్లినంతపని అయ్యింది. అన్ని వ్యాసాలూ స్వయంగా వ్రాసి ఆ పిల్లచేత పదిసార్లు చదివించి తాను చదివి వినిపించాడు. పరీక్షలకు మరో నెల ఉందనగా - శేషు ఒకసారి మందహాసం చేస్తూ "ఏమండీ మాస్టారూ- మిమ్మల్ని ఒకటి అడగాలనుకొంటున్నానండీ" అంది.

"ఏమిటది ?"

"పెద్ద విశేష మేమీ లేదండీ - మీరు పాఠాలు బాగా చెబుతున్నారండీ - నేను ఈసారి పరీక్షలో నెగ్గుతానని ధైర్యం వచ్చిందండీ..." అని మళ్ళీ ఆగింది. "ఆ. అయితే ఇంక మానెయ్యండి. అనా చెప్పబొయ్యే విషయం - ఆ పప్పులేమి ఉడకవు" అన్నాడు రావు.

"అబ్బె అది కాదండీ - ఈ నెలరోజులూ మా స్నేహితురాలు కూడా వచ్చి మీదగ్గర పాఠాలు వింటానంటోందండీ- మిమ్మల్ని అడిగి ఏ మాటా చెబుతానన్నాను. నాకు మీరు చెప్పిన విషయాలన్నీ ఎప్పటి కప్పుడు ఆ అమ్మాయికి చెప్పేస్తూనే వున్నాను" అన్నది శేషు.

"ఆహా అల్లాగా! అల్లాగా చెబుతూ ఉండటం మంచిపనే. అందుకనే నీకు కొన్ని విషయాలు బాగా జ్ఞాపకం ఉంటున్నాయి, నరేగాని ఎవరా అమ్మాయి - ఏకలవ్య శిష్యత్వం వహిస్తోంది ?" అని అడిగాడు రావు.

"మాస్టారూ మాస్టారూ, మీ ఉపమానం సమంగా సరిపోదండీ - నేను మీరు చెప్పిందల్లా సరిగ్గా అక్కడ ప్లేటు పెట్టేస్తున్నాగా- అదీగాక

ఆ అమ్మాయి ఒకరు చెప్పకుండానే సొంతంగా చదువుకొని ప్యాసు కాగలదు."

"అయితే మరెందుకూ ఇక్కడికి రావడం?"

"ఏమిటండీ మాస్టారూ - అంతసేపు అడిగించుకొంటా రేమండీ- వస్తే మీ సొమ్మేంపోతుందీ - ఎల్లాగా నాకు చెబుతూనే ఉన్నారయ్యే - మా యిందిర కూడా వచ్చి వింటుందీ - ఏం" అని తల ఎగరవేస్తూ అడిగింది.

"ఇంతకీ మీ స్నేహితురాలి పేరు ఇందిరా! సరే అయితే మీ ఇందిర మంచిపిల్లేనా - లేక ఇద్దరూ కలిసి అల్లరి మొదలుపెడతారా - ఆ విషయం ముందు చెప్పు."

"అబ్బే పరీక్షలు వస్తుంటే అల్లరి ఎందుకు చేస్తామండీ."

"చేస్తే?"

"చేస్తేనా ... కనుక్కొని వస్తా నుండండి ఆ అమ్మాయి క్రిందే ఉంది. తీసికొని వస్తా నుండండి" అని శేషు క్రిందకు వెళ్ళి మరో పది నిముషాలకు తన స్నేహితురాల్ని వెంటబెట్టుకొని వచ్చింది.

ఇందిర వచ్చి కూర్చున్న తీరూ, పాఠం విన్న విధమూ, అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే పద్ధతీ చూచి రావు ఆశ్చర్యపడ్డాడు. ఆమె చాలా బుద్ధిమంతురా లనిపించింది.

ఆమెవంక చూచి రావు ఏదైనా ప్రశ్న వేస్తే తరచు సిగ్గుపడేది. "వచ్చునండీ" అని ఆగితే "వస్తే చెప్పరాదూ" అని బలవంతపెట్టి చెప్పించేవాడు.

ఆమె నవ్వినా- నవ్వుతూ మాటాడినా ముత్యాల పలువరుస కన్పించేది. శేషుకంటే ఆ పిల్ల రెండేళ్ళు పెద్ద అనిపిస్తుంది. శేషు

ఓణీలు వేస్తుంటే ఆమె కాస్త తేలికైన చీరలు కట్టేది. శేషుకంటె బలంగా ఆరోగ్యంగా అందంగా కన్పించేది ఇందిర.

అంత చక్కని పిల్లకు- అంత పొందిక గల పిల్లకు పాఠం చెప్పడం కూడా ఒక సరదా అనిపించింది రావుకు.

ఆమె వెళ్ళిపోయిన తర్వాత రావు "ఇంతకూ ఎవరమ్మాయి మీ స్నేహితురాలు?" అని అడిగాడు శేషుని.

"మన లింగయ్యగారి అమ్మాయేనండీ - మీకు భోజనం అదీ వారింటినుంచే వస్తుంటా." "అహా అల్లాగా- చెప్పవేం మరి" అన్నాడు రావు. మార్చి దగ్గర పడుతున్న కొద్దీ వారందరి కృషి ఎక్కువయ్యింది. రాత్రిళ్ళు కూడా శేషు - ఇందిరా ఇద్దరూ రావు గదిలోనే చాలా ప్రొద్దు పోయేదాకా కూర్చుని చదువుకొనేవారు. అల్లాంటి సమయాల్లో తరుచు కట్టయ్యగారు వచ్చి "అమ్మాయి! ప్రొద్దుపోయింది. ఇంక వెళ్ళి పడుకో కూడదూ- ఏమంటావ్ పంతులూ" అనేవారు.

"పోనీ చదువుకోనీండి - నిద్రవస్తే వాళ్ళే పడుకొంటారు" అనేవాడు రావు.

"ఆ. ఆ. నీకేమయ్యా ఆరోగ్యం చెడిందా అంటే అవస్థపడ వలసింది మేమేగా" అనేవారు కట్టయ్యగారు.

వాళ్ళను దీక్షగా చదివిస్తూ- అనుమానాలు కలిగితే వెంటవెంటనే తీరుస్తూ రావు చాలా శ్రద్ధ చూపేవాడు. తరుచు అతనూ ఆ గదిలోనే కూర్చుని తానూ ఏదో పుస్తకం చదువుకొనేవాడు. కొన్ని సమయాల్లో పరీక్షల్లో వస్తాయనుకొన్న ప్రశ్నలన్నింటికీ సమాధానాలు సమగ్రంగా వ్రాసి వారికి సిద్ధపరచి ఉంచేవాడు. మరికొన్ని సమయాల్లో ప్రక్క గదిలోకి పోయి గోపాల్‌ని చదివిస్తూ - లక్ష్మికి కథలు చెప్పేవాడు. లక్ష్మి అతనిదగ్గర చాలా కథలే చెప్పించుకొంది.

కొన్ని సమయాల్లో లక్ష్మి అతని దగ్గరే పడుకొని అంతకు ముందు చెప్పిన కథల్ని గురించి ఏమేమో తరచి తరచి ప్రశ్నలు వేస్తూ నిద్రపోయేది.

ఆ పిల్ల రావుకు బాగా మాలిమి అయ్యింది. అతని మాటమీద కాఫీ మానివేసింది. అన్నిపాఠాలు చిలకలా వప్పజెప్పేది. "ఏమండీ మాష్టారూ ఎంతసేపు మా అక్కకే చెబుతున్నారు - మాకు చెప్పడం లేదేమండీ?" అని తరుచు అడిగేది.

శేషు - ఇందిర పోటీలు పడి చదివేవారు. ఒక్కొక్క రోజు ఇందిరకంటె ముందుగా శేషుకు నిద్రవచ్చేది. అక్కడే ఒరిగి నిద్ర పోతూ "ఒసే ఇందిరా మరో పావుగంట పొయ్యాక లేపవే" అని అరగంట నిద్రతీసేది. కట్టయ్యగారి భార్య పిల్లలతోపాటు రావుకూడా తేనీరు ఇచ్చేది.

శేషు నిద్ర పోతూఉన్న సమయాల్లో ఎప్పుడైనా రావు ఇందిరను పల్కరిస్తే ఆ పిల్ల చెప్పరానంత సిగ్గుపడేది.

"నేను చెప్పేవి బాగా అర్థమవుతున్నాయా; పరీక్షలో ప్యాసవుతాననే ధైర్యం కలుగుతోందా?" అని ఇల్లాంటి చిన్నప్రశ్నలు వేసినా ఆమె తల ఎత్తకుండానే ఆ. ఆ. అని వినయంగా జవాబుచెప్పి చదువులో లీనమైపొయ్యేది

ఇందిర అల్లాగే సిగ్గుపడుతూ తల వంచుకొని కూర్చోడం చూచినప్పుడల్లా రావుకు క్రొత్తగా పూచిన పూలభారంతో వంగిన గులాబీ రెమ్మలు జ్ఞాపకం వచ్చేవి.

* * *

మార్చి వచ్చి వెళ్ళిపోయింది.

సెంటరుకు వెళ్లి ఆ యిద్దరు పిల్లలూ పరీక్షలు వ్రాసి "అన్నీ మాస్టారు చెప్పినవే వచ్చాయి" అనుకొంటూ ధైర్యంగా తిరిగి వచ్చారు. వెంట వెళ్ళివచ్చిన రావూ చౌదరిగారూ ఇద్దరూ ఒకరినొకరు చూచుకొని సంతోషపడ్డారు. నా కృషి ఫలించింది కదా అని రావు గర్విస్తే తన కుటుంబంలో- అటు తన బావమరదుల కుటుంబాలను కూడా కలుపుకొని- స్కూలుఫైనలు ప్యానయిన గౌరవం తొలిసారిగా తన కుమార్తెకు- తద్వారా తనకు దక్కుతోంది గదా అని కట్టయ్యగారు గర్వపడ్డారు ఇంటికి తిరిగి వచ్చిన రోజున.

అందరూ చాలా ఉత్సాహంగా సంతోషంగా కన్పించారు. ప్రొద్దున్న పూట కాఫీల వేళకు ఇందిర కూడా వచ్చింది.

అందరూ కలసి ఫలహారాలు చేశారు. కాఫీలు త్రాగారు. గడచిన రోజుల్లో పడిన శ్రమను గురించి ప్రస్తావించుకొన్నారు.

"మాస్టారూ- మీరు గనుక రాకపోతే- మా అక్క ఈ యేడాది కూడా ..." అని నవ్వు ఆపుకొని నోటిమీద చెయ్యి వేసుకొన్నాడు గోపాల్. "ఏడిచావ్ లేవోయ్ మహా నువ్వేనే చెప్పేది. వారు రాకపోతే నువ్వు ఈ థర్డుఫారం - థర్డుఫారం ఆ నర్సయ్యి - పొలం పుట్రా చూచుకొనేవాడివి" అన్నది శేషు.

ఆ మాటకు కట్టయ్యగారు నవ్వారు. ఇందిర నవ్వింది. శేషు పెద్దగా నవ్వింది.

లక్ష్మి నవ్వడానికి ప్రయత్నం చేసింది గాని, నవ్వు రాలేదు. "అక్కా ఆనర్సంటే ఏమిటే" అని అమాయకంగా అడిగింది.

ఆ మాటకు కట్టయ్యగారు మరింతగా నవ్వుతూ వక్కపొడి పళ్లెం బల్లమీద పెట్టి వెళుతున్న భార్యవంక చూస్తూ "అదా అమ్మా- మీ చిన మామయ్య చదివేదే అది" అన్నారు. అందు కామె వారనుకొన్నట్లుగానే

కొంత రోషపడుతూ "మా తమ్ముని విషయం దేనికి మీకూ - వాడికీ పిచ్చి చదువులు రాకపోయినంత మాత్రాన ఏం కొరవ రాలేదు. లక్షణంగా వంద ఎకరాలు సొంత వ్యవసాయం చేసుకొంటున్నాడు" అన్నది అని కొంచెం ధైర్యం తెచ్చుకొన్నదో ఏమో "చూద్దాంగా - మీ పిల్లలు చదివి ఏ ఉద్యోగాలు వెలగబెడతారో" అన్నది.

"అవునమ్మా, చినమామయ్య కేమమ్మా - థర్డుఫారం ప్యాను కాకపోయినా జిల్లా బోర్డు ప్రెసిడెంటు అయ్యాడు" అన్నది శేష మళ్లా. అందరూ నవ్వుకొన్నారు.

అల్లా గడిచిపోయింది ఆ పూట అంతా. అందరికీ తనమీద మంచి అభిప్రాయం కలిగినందుకు రావు ఎంతో సంతోషించాడు.

"ఈ పూట క్యారేజీ రాదటండీ" అన్నది శేష.

"ఏం ఎందుకనేమిటి" అని అడిగారు కట్టయ్యగారు ఇందిరవంక చూస్తూ.

"అఁ ఏం లేదండీ- ఈ పూట భోజనానికి మా యింటికే వస్తారు. మా అమ్మ పిల్చుకొని రమ్మంది. మా నాన్నగారు వచ్చి తీసుకొని వస్తానన్నారండీ"- అని రావువంక తిరిగి "ఏమండీ వస్తారు కదూ?" అని ధైర్యంగానే అడిగింది.

అందుకు రావు కొంతగా ఆశ్చర్యపడ్డాడు- ఎప్పుడూ సిగ్గుపడుతూ ఉండే పిల్ల ఇంత ధైర్యంగా అన్ని మాటలు పలికేసరికి.

"ఆహా- అల్లాగా - అయితే రావల్సిందేనా" అని మాత్రం అన్నాడు నవ్వుతూ.

"రాకపోతే ఎల్లామరి- రావల్సిందే" అన్నది - కాని అంతలో ఇందిర సిగ్గుపడ్డది.

"అల్లా సిగ్గుపడుతుందేమే ఇందిర - పెళ్ళికూతురిలాగ" అని అడిగింది శేషు తల్లి. "అవునే- ఇది పెళ్లికూతురే- అసలీపాటికి పెళ్ళి అయిపోవాల్సిందే- లింగయ్య నాకిప్పటికి రెండేళ్ళనుండి చెబుతున్నాడు అమ్మాయి పెళ్ళి చేసేస్తానంటూ."

"ఆ మరి..." అన్నది ఆయన భార్య. "కట్నాల విషయం కొంత బాధకంగా ఉందాయనకు. అయినా చదువుకొన్నవాడు దొరికితే అందుకూ సిద్ధపడే ఉన్నాడాయన" అన్నాడు కట్టయ్యగారు.

* * *

ఆ పూట మధ్యాహ్నం పదకొండు కొట్టాక లింగయ్యగారు వచ్చి రావుని తమ ఇంటికి తీసుకొని వచ్చారు.

లింగయ్యగారి భార్య- లక్ష్మీదేవిలా కళకళలాడుతున్న మొగాన పెద్ద కుంకుమబొట్టుతో పట్టుమడిచీర కట్టుకొని ఆ ఇద్దరికీ వడ్డించింది. ఇందిర నేతిజాడీ అందుకొంది.

"మా అమ్మాయి ప్యాసు అయితే అదంతా నీ చేతిచలువే అనుకొంటున్నాం నాయినా - ప్రతిఫలంగా ..." అని భర్తవంక చూచిందావిడ.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను" అన్నారు లింగయ్యగారు.

ఇందిర మరో రెండు గారెలు అదనంగా తెచ్చివేసింది

"వద్దంటే అల్లావేస్తావేం" అన్నట్లుగా కాస్త కోపంగా అధికార పూర్వకంగా చూచాడు రావు.

పెదిమలపై చిరునవ్వు నిలిపి ఉంచి, తల చిత్రంగా ఆడిస్తూ "ఇక్కడ కూడా మాస్టారి లాగానే దబాయించేస్తున్నారే!" అన్నది ఇందిర.

అతను చేయి కడుక్కుంటున్నప్పుడు సబ్బుబిళ్ళ అందించింది. తుడుచుకోడానికి క్రొత్త తువ్వాలా ఇచ్చింది.

"అన్నీ నీవే అందిస్తున్నావే" అన్నాడు రావు చేయి తుడుచుకొంటూ.

"మరిక్కడ చౌదరిగా రింట్లోలాగా నౌకర్లు లేరుగా" అన్నది ఇందిర.

ఎవరో వరాయివాళ్లు నౌకర్లు అందివ్వడంకంటె ఆమె ఇవ్వరమే- అందంగా- మర్యాదగా ఆప్యాయతా సూచకంగా కన్పించింది రావుకు. అందువలననే సంతోషించా డతను విస్తట్లో వడ్డించిన పంచభక్ష పరమాన్నాలకంటే భోజనం చేస్తున్నప్పుడు వడ్డించే వ్యక్తులు "అబ్బే అసలు మీరు భోజనమే చేయడంలేదే- ఏదో మొహమాటం పడుతున్నారే- ఏం కావాలండీ" అంటూ ఆప్యాయంగా అనే మాటలే రుచికరమైనవీ, మధురతరమైనవీ అని రావు కప్పుడు తెలిసివచ్చింది.

లింగయ్యగారు తాను తాంబూలము వేసుకొంటూ అతనికీ ఆకు-వక్కలూ అందిస్తూ "వేసుకోవయ్యా" అన్నాడు.

"అబ్బే నా కలవాటు లేదండీ" అన్నాడు రావు "అది కాదు నాన్నగారూ- ఒట్టి తాంబూల మిస్తే ఎల్లా- కొంత దక్షిణ కూడా కలిపి ఇవ్వాలేమో కనుక్కోండి" అన్నది ఇందిర తలుపుచాటున నిలుచుండే.

రావు ఏదో సమాధానం చెబుదామనుకొన్నాడు. కాని ఇందిర ఇంత మాత్రపు ఛలోక్తి విసర గలిగిందే అన్న ఆశ్చర్యంలో పడి ఆతను మాటాడలేక పొయ్యాడు.

"సరే అమ్మాయి మాటకేం గాని రెండు ఆకులు వేసుకో" అని లింగయ్యగారు అందివ్వ బొయ్యారు.

అంతలో - పొడుగుపాటి చుట్ట కాలుస్తూ వేళ్ళతో దాన్ని గుండ్రంగా త్రిప్పుతూ కట్టయ్యగారు లోపలకు వస్తూనే "ఏమోయ్ బావా! అప్పుడే తాంబూలాలు దాకా వచ్చేసిందా ఏమిటి? మాష్టరు కుఱ్ఱవాణ్ణి అమాయకుణ్ణి చేసి లాంఛనాలు లేకుండా దగా చేసేద్దామనుకొంటున్నావా ఏమిటి!" అన్నారు నవ్వుతూ.

"అబ్బే లేదయ్యా- తాంబూలమ్ వేసుకోవయ్యా, అంటే అలవాటు లేదంటున్నాడు. సరెసరె మొత్తంమీద కుఱ్ఱవాణ్ణి మాంచి కట్టుదిట్టంలోనే పెట్టావన్న మాట."

"అదేం మాట. నేను గాదు- అతనే మా అందర్నీ కట్టుదిట్టంలో పెట్టాడు. మీ అక్క చూశా; నామీద అయితే పిల్లల విషయంలో కాస్త చీమతలకాయంత లోపం వస్తే ఆల్లా ఎగురతుందా- మరి ఇతను ఇప్పుడు కాఫీకి వెళ్ళడానికి వీల్లేదూ అంటే, వీల్లేకపోయింది. అంతే. ఆవిడగారు నోరెత్తితే ఒట్టు. గోపాలం ఇప్పుడెంత బుద్ధిమంతుడయ్యాడనుకున్నావ్'' అంటూ ప్రశంసలోకి దిగారు కట్టయ్యగారు.

"అవునవును వింటూనే ఉన్నా'' అంటూ కట్టయ్యగారికి వక్కలు అందించారు లింగయ్యగారు.

"అయితే నేనిక వెళ్ళి వస్తానండీ'' అని రావు వారి దగ్గరనుండి బయలుదేరి తన గది చేరుకున్నాడు నవ్వుకొంటూ.

* * *

సరేగానీ కట్టయ్య బావా - నువ్వైతే ఏదో రొఖ్ఖం ముట్టజెప్పి తీర్చుకొంటావు బాగానే వుంది. మరి నా సంగతేమిటీ- మీ అక్కయ్య నిన్నటినుంచీ ఆ మాటే అడుగుతోంది. మరి నాకూ మార్గం చెప్పు. నన్నేం ఇమ్మంటావ్?'' అన్నారు లింగయ్యగారు.

"చెప్పనా ?"

"చెప్పు మరి!"

"చెప్పేస్తున్నా- ఆలోచించే చెప్పేస్తున్నా"

"ఊఁ చెప్పు మరి."

"పిల్ల నిచ్చేయ్"

"ఏం నరసమయ్యా బావా. నరసానికైనా సరే అందామన్నా, అదేమంత తేలికైన పనా."

"అది కాదయ్యా- నేను నిజంగానే అంటున్నా. నువ్వు సరే అను- మిగతా విషయం నేను చూస్తా- అసలు మా అక్కయ్య ఏమంటుందో చూడు ?"

"అదేమంటుంది! మా ఇద్దరికీ ఏ సంకోచమూ లేదు. అయితే ఒకటీ. B.A. అయిన వాడు- బేరం ఎంత ఎత్తులో వుంటుందో ఏమో!"

"నువ్వు మాట్లాడక రెండు వేలకు తూగిరా. మన చలపతిని పంపి మిగతా వ్యవహారం నేను నడిపిస్తా- సరేనా"

"సరే"

"సరే అన్నాక మాట తప్పావా ..."

"అదేం లేదన్నాగా"

"అయితే మరి నేనింక వెళ్ళొస్తా" అన్నారు కట్టయ్యగారు ఆరిపోయిన చుట్ట మరలా వెలిగించుకొంటూ.

ఇద్దరూ ఒకరి నొకరు చూచుకొని సంతోషంగా ఆప్యాయంగా నవ్వుకొన్నారు.

*   *   *

అనుకొన్నట్లుగానే చలపతిరావుగారు వెళ్ళి వ్యవహారం నడిపి వచ్చారు.

లింగయ్యగారికి బ్రహ్మానంద మయ్యింది. వారి ఆనందం ముప్పిరిగొన్నది. అనుకోకుండా మంచి అల్లుడు లభించడం - ఇందిర అదృష్టవంతురాలవడం- సమయానికి తను అమ్మజూపిన పొలం మంచి ధర పలికి కట్టయ్యగారి పలుకుబడితో ధనం చేతికందడం- ఈ మూడు ఒక్కసారిగా జరిగేసరికి వారి హృదయం ఆనందంతో నిండి తేలిక అయ్యింది.

చలపతిరావుగారి వెంట కట్టయ్యగారు కూడా వెళ్ళి - రావు తలి దండ్రుల్ని లగ్నానికి తరలించుకొని వచ్చారు.

లింగయ్యగారు అన్ని ఏర్పాట్లూ సక్రమంగానే జరిపించారు.

వారు రావుకు రెండు వేలు కట్నం రూపంలో ఇచ్చి అన్నింటి కంటె అమూల్యంగానూ - పెన్నిధిగనూ భావించి ప్రేమతో పెంచి పెద్దజేసిన కుమార్తె ఇందిరను రావు చేతికి వప్పజెబుతూ "భద్రం నాయనా" అన్నట్లు చూస్తూ ఆనందాశ్రువులు రాల్చారు.

చదివింపుల్లో కట్టయ్యగారిదే పెద్దచెయ్యి అయ్యింది. వెయ్యినూట పదహార్లు చదివించారు.

వారి భార్య ఇందిరకు పట్టుచీరె చదివించింది. శేషు స్నేహితురాలికి గాజులూ, గురువుగారికి రిస్టువాచీ చదివించింది. "మాష్టారూ మీకిప్పుడు నే నేమి ఇవ్వనండీ" అంటూ నమస్కారములు చేశాడు గోపాల్. లక్ష్మి రెండు రబ్బరు బొమ్మలు తెచ్చి వాటిని "మాష్టారు! వీటితో మా ఇందిరక్కాయను భయపెట్టండి" అని నొక్కి కీచు కీచు మనిపించింది. ఇందిర నిజంగానే భయపడుతున్నట్లు నటించింది.

రావు - ప్రయివేటు మాష్టారు రావు - చిరునవ్వులు నవ్వుతూ లక్ష్మిని దగ్గరకు లాక్కొని "అన్నిటికంటే నీ బహుమానాలే బాగున్నాయమ్మా" అంటూ ఆ పిల్ల బుగ్గలు గిల్లి ముద్దాడాడు. అతను మరొకసారి లక్ష్మిని ముద్దాడుతూ ఇందిర వంక చూచి కావాలని కొంటెతనం పోతూ నవ్వాడు.

ఇందిర సిగ్గుపడ్డది చాలా సిగ్గుపడ్డది. ఆమె సిగ్గుపడటం చూచి "అదేమో" అని ఆమె జడలోని మల్లెలు తెల్లబోయాయి.

* * *

ఆ రోజు ప్రొద్దుట పాఠాలకు పిలవడానికి వెళ్ళేసరికి చిన్నవాళ్ళు- లక్ష్మి- గోపాల్ లేచి నవ్వుతూ "నమస్కారం మాష్టారూ" అన్నారు. "మరి పాఠాలకు రండి" అన్నాడు రావు. గోపాలుకు ఏప్రియల్లో పరీక్షలు. అందాక ఉండి వెళ్ళమన్నారు కట్టయ్యగారు.

"ఇవ్వాళ కూడా పాఠాలు చెబుతారా అండీ" అన్నది లక్ష్మి గోపాల్ వంక ఒకసారి తిరిగి చూచి మళ్ళీ అతని వంక చూస్తూ.

"ఏం ఎందుకు చెప్పనూ- నాకేం తలనొప్పి రాదుగా" అన్నాడు రావు నవ్వుతూ.

"అది కాదండీ, పెళ్ళి అయింది కదా - ఇంక చెప్పరేమో అనుకొన్నానండీ - అదేనండీ మా అక్కయ్యే అన్నదండీ" అన్నాడు గోపాల్ ఎందుకో తను సిగ్గుపడుతూ.

"అహా అల్లాగేం - సరె సరె వదండి - నా పెళ్ళికాదు నీ పెళ్ళి అయ్యేదాకా చెబుతాను" అన్నాడు రావు. అని నవ్వుతూ పిల్లల్నిద్దర్నీ

చెరో చేత్తోనూ వాళ్ళ చేతుల్ని పట్టుకొని తన గది దగ్గరకు తీసికొని వెళ్లాడు. రావు తన గది గుమ్మంలో అడుగు పెడుతుండగా క్రింద నుంచి మాటలూ - మాటల్ని కమ్మివేస్తూ విరగబడి నవ్వడాలూ వినిపించాయి.

"ప్రయివేటు మాస్టారే" అని ఆగి, శేషు పెద్దగా నవ్వి - ఏదో అన్నది గాని వినపడలేదు. "ఊరుకోవే శేషూ" అంటూ ఇందిరా నవ్వు ఆపుకోలేక నవ్వింది.

ఆ ఇద్దరి నవ్వులూ పైదాకా వినిపించాయి.

---